# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ జనవరి 25 శనివారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 188

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





2లో

## పసిడి ధరలు మరింత పైపైకి


83వేలు దాటిన పదిగ్రాముల బంగారం ధర

### రేవంత్ 'ఐటీ ఉద్యోగి' వ్యాఖ్యలు..

# కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్



రాజన్నసిరిసిల్లజిల్లా:నేను రాజకీయాల్లోకి రాకముందు ఐటీ సౌత్ ఇండియా హెడ్‌గా పనిచేసింది నిజమేనని, మరి అప్పుడు సీఎం రేవంత్ ఏం చేసేవాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. సిరిసిల్లలో కేటీఆర్ శుక్రవారం(జనవరి24) మీడియాతో మాట్లాడారు.' సీఎం రేవంత్‌రెడ్డివి అహంకారపూరిత మాటలు. నేను ఐటీలో ఉన్నపుడు రేవంత్ ఏం చేసిండు..? బ్రోకరిజమా, సూట్ కేసులు మోసుడా..ఇవన్నీ నేనంటే మళ్ళీ నాపై ఏడుపొకటి.ఎవరైనా బీఆర్ఎస్‌ను వీడితే కేసీఆర్ అన్నట్టు వారి గ్రహచారం బాగా లేకపోవడమే. నేను మళ్ళీ చెబుతున్నా.నాపై పెట్టినవి లొట్టపీసు కేసులు.లై డిటెక్టర్ పెట్టి విచారణ చేసుకోమని నేనే సవాల్ విసురుతున్నా. ప్రజాపాలన సభల్లో జనం ఎందుకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.స్పష్టత లేకుండా గ్రామసభలు నిర్వహిస్తే జనం తిరగబడ్డారు.పథకాల అమలు చేతగాక కాంగ్రెస్ మంత్రులు ఇతర పార్టీలపై బురద జల్లుతున్నారు'అని కేటీఆర్ విమర్శించారు.కాగా, దావోస్ పర్యటనలో ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కేటీఆర్‌ది కేవలం ఐటీ ఉద్యోగి మెంటాలిటీ అని తాను పాలసీ మేకర్‌నని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దీనిపై ఐటీ రంగంలోని ఉద్యోగ వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే ఈ విషయమై ఎక్స్(ట్విటర్)లో స్పందించిన కేటీఆర్ తాజాగా నేరుగా రేవంత్‌కు కౌంటర్ ఇచ్చారు.







## హైదరాబాద్ అభివృద్ధికి

# రూ.55 వేల కోట్లు ఇవ్వండి

రాష్ట్రంలో పురపాలక సంస్థల అభివృద్ధికి కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర విద్యుత్తు, గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

- మెట్రో నిర్మాణానికి రూ.24 వేల కోట్లు అవసరం
- మూసీ అభివృద్ధికీ చేయూత అందించాలి
- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి

హైదరాబాద్: రాష్ట్రంలో పురపాలక సంస్థల అభివృద్ధికి కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర విద్యుత్తు, గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు రూ.55,652 కోట్లు ఆర్థిక సాయం చేయాలన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో పీఎంఏవై(యు), పట్టణాభివృద్ధి, విద్యుత్తు శాఖలపై సంబంధిత ఉన్నతాధికారులతో కేంద్ర మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 65 శాతం పట్టణ ప్రాంతమేనన్నారు. తెలంగాణను రూ.లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో కనెక్టివిటీ, ఈస్ట్ వెస్ట్ కారిడార్, రీజినల్ రింగ్‌రోడ్, గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్లు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సరస్సుల పునరుజ్జీవం, నీటిఎద్దడి నివారణ, భూభారతి చట్టం, మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్-2050, బిల్డ్‌నౌ, టౌన్‌షిప్ గ్రోత్ సెంటర్లు, ఫ్యూచర్‌సిటీ తదితర ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్రమంత్రికి వివరించారు. 20 లక్షల ఇళ్లు మంజూరు చేయండి దేశ పట్టణ జనాభాలో 8 శాతం తెలంగాణలో ఉన్నారని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన(అర్బన్) 2.0లో చేరిన తొలి రాష్ట్రమైన తెలంగాణ ఇళ్ల నిర్మాణానికి సమగ్ర సమాచారం, ప్రణాళికతో సిద్ధంగా ఉన్నందున 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని సీఎం కోరారు. దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లో మెట్రో కనెక్టివిటీ తక్కువగా ఉందని, అందుకే మెట్రో ఫేజ్-2 కింద ఆరు కారిడార్లు గుర్తించామని, వీటిలో అయిదింటికి డీపీఆర్‌లు పూర్తయ్యాయన్నారు. వీటి నిర్మాణానికి రూ.24,269 కోట్లు అందించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యం కింద చేపట్టి నిధులు కేటాయించాలని రేవంత్‌రెడ్డి విన్నవించారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి చేయూత ఇవ్వాలన్నారు. ఈ నదిలోకి మురుగునీరు చేరకుండా ఇరువైపులా కలిపి రూ.110 కిలోమీటర్ల పొడవునా కాలువలు, బాక్స్ డ్రెయిన్లు, ఎస్టీపీల నిర్మాణానికి రూ.10,000 కోట్లు ఇవ్వాలని నివేదించారు. హైదరాబాద్‌తో పాటు సమీపంలోని 27 పట్టణ స్థానిక సంస్థల్లో సమగ్ర మురుగునీటి నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేశామని, ఇందుకు రూ.17,212 కోట్లు ఖర్చవుతుందని, అమృత్ 2.0 లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా దీన్ని గుర్తించి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు.

# బడ్జెట్‌కు చకచకా ఏర్పాటు

## హల్వా వేడుకల్లో పాల్గొన్న నిర్మలా సీతారామన్




న్యూఢిల్లీ: ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే కేంద్ర బ్జడెట్‌కు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఏటా నిర్వహించే హల్వా వేడుకను నార్త్ బ్లాక్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ వేడుకలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బడ్జెట్ తయారీ పక్రియలో పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి హల్వాను నిర్మలా సీతరామన్ స్వయంగా పంచిపెట్టారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి, ఉన్నతాధికారులు తుహిన్‌కాంత్ పాండే, అజయ్ సేథ్ తదితరులు ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రవేశపెట్టడం ఇది వరుసగా ఎనిమిదోసారి. ఓ వైపు జీడీపీ వృద్ధి మందగించిన వేళ (6.4 శాతం నమోదు కావొచ్చని అంచనా) 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆమె బడ్జెట్ ప్రతిపాదించనున్నారు. ఈ సారి కూడా డిజిటల్ రూపంలోనే బ్జడెట్ ప్రవేశపెట్టనున్నారు. గడిచిన నాలుగు బడ్జెట్లుగా ఇదే పద్ధతిని అనురిస్తున్నారు. బ్జడెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది - పార్లమెంట్‌లో దానిని ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. వారు బయటకు వెళ్లడానికి వీలుండదు. వారు ఎల్లప్పుడూ సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది నిఘాలో ఉంటారు. కనీసం వారు ఫోన్ చేయడానికి కూడా వీలుండదు. ఒకసారి పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే వీరు బయటకు వస్తారు. అంటే దాదాపు మరో వారం రోజుల పాటు వీరికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండవన్నమాట. 1950లో బ్జడెట్లోని ముద్రణ పక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అవ్వడంతో ఈ లాక్-ఇన్ నిర్ణయం తీసుకున్నారు.

# ఆధ్యాత్మిక పర్యాటకంగా భారత్

### మహాకుంభమేళాపై విదేశీయుల ఆసక్తి

### భారీగా తరలి రావడంతో పెరిగిన ఆదాయం

144 ఏళ్ల తర్వాత ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభ మేళాకు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. దీంతో విదేశీ టూరిజంలో గణనీయమైన పెరుగుదల కనిపించింది



2లో



2లో

## రజాకార్ మూవీని తప్పకుండా చూడాలి


తెలంగాణ కథను వీక్షించాలన్న మంత్రి బండి





2లో

### యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలి



2లో

# ట్రంప్ దూకుడుపై తొలిదెబ్బ

### సియాటిల్ ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం

### జన్మతః పౌరసత్వం రద్దును అడ్డుకున్న కోర్టు

# దేశవ్యాప్తంగా పేదలకు కోటి ఇండ్ల నిర్మాణం

- తెలంగాణకు అదనంగా ఇవ్వడానికి సిద్ధం
- కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ వెల్లడి
- అభివృద్ధి తప్ప రాజకీయం లేదన్న బండి



2లో

# మెగా కృష్ణారెడ్డి కోసం దావోస్ వెళ్లాలా?

### గోదావరి జలాలు తరలిస్తుంటే ఏం చేస్తున్నారు

### బాబుకు రేవంత్ గురు దక్షిణ చెల్లిస్తున్నారా

### మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



2లో



2లో

## జామ్‌నగర్‌లో అతిపెద్ద డేటా సెటర్ ?

### రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ యోచన

వేగుచుక్క

# లబ్దిదారుల ఎంపిక పారాధర్శకంగా జరగాలి.

**- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్త.**





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 24:**

లబ్దిదారుల ఎంపిక పారాధర్శకంగా జరగాలనీ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. నగరంలోని 28వ డివిజన్ గాజుల్ పేటలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన వార్డ్ సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ హాజరు అయ్యారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గనికి సంవత్సరానికి 3500 ఇండ్లు ఇస్తామని మొదటి విడుత కింద జాగా ఉన్న లబ్దిదారులకు 5 లక్షల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నాం అన్నారు. డివిజన్ల వారిగా జరిగే లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నుండి వచ్చిన జాబితాలో అవకతవకలు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, వాటిని వార్డు సభలో అధికారులు, కమిటీ సభ్యులు సరి చేయాలనీ అర్హులైన లబ్దిదారులకు మాత్రమే పార్టీలకు అతీతంగా ప్రజలకు అందించాలన్నారు. అర్బన్ నియోజకవర్గంలో గత పదేళ్ల నుండి ఒక్క ఇండ్లు కూడా అర్హులైన వారికీ రాలేదని, రాష్ట్ర ప్రభుత్వం 3500 ఇండ్లతో పాటు మరో 3500 ఇండ్లు కేటాయించి జాగా లేని వాళ్లకు ప్రభుత్వ స్థలంలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

**కొత్త రేషన్ కార్డు :**

గత ప్రభుత్వం హయాంలో కొత్త రేషన్ కార్డు లేక చాలా మంది గరిబోళ్ళు సంక్షేమ పథకాలకు దూరం అయ్యారని అన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చే ప్రతి సంక్షేమ పథకానికి రేషన్ కార్డు ప్రామాణికం కాబట్టి అర్హులైన వారందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు జారీ చేయాలనీ సూచించారు. గత ప్రభుత్వం మాదిరిగా పేరుకు మాత్రమే పథకాలు ప్రవేశపెట్టకుండా త్వరత గతిన లబ్దిదారుల అందరికి సంక్షేమ ఫలాలు అందించలని డిమాండ్ చేసారు. గత ప్రభుత్వంలాగే ప్రజలను మభ్యపెట్టాలానే ఉద్దేశంతో కేవలం లబ్దిదారుల ఎంపిక జాబితాకే పరిమితం చేసే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేయాలనుకుంటే ప్రజల తరుపున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ దిలీప్ కుమార్, స్థానిక కార్పొరేటర్ ఇల్లేందుల మమత ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి.

**- నగరంలో ఆర్టీఏ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ.**







**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 24:**

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వరరావు సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆర్టీఏ కార్యాలయం నుంచి వర్ని చౌరస్తా వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్ పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంవీఐలు కిరణ్ కుమార్, రాహుల్ కుమార్, ఐదో టోన్ ఎస్సై గంగాధర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా పేదలకు కోటి ఇండ్ల నిర్మాణం



**కరీంనగర్:** ఈ ఏడాది దేశవ్యాప్తంగా కోటి ఇండ్లను నిర్మించబోతున్నట్లు కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ అన్నారు. తెలంగాణకు రావాల్సిన వాటా కంటే ఎక్కువ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. కరీంనగర్ డంప్ యార్డ్‌ను ఎత్తేస్తాం. అందుకు అవసరమైన నిధులన్నీ కేంద్రమే మంజూరు చేస్తుందని అన్నారు. . విద్యుత్ విషయంలోనూ తెలంగాణకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నా' అని కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభాలు చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో కరీంనగర్‌కు చేరుకున్న ఖట్టర్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రమంత్రి శంకుస్థాపనలు చేశారు. కరీంనగర్ లో 24 గంటల తాగునీరు, మల్టీ పర్పస్ పార్క్‌ను కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, బండి సంజయ్ కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం హౌజింగ్ బోర్డు కాలనీలో జరిగే బహిరంగ సభలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండిసంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో తనకు ఎలాంటి విభేధాలు లేవని అన్నారు. గంగుల కమలాకర్‌తోనే కొద్దిగా గ్యాప్ ఉందని త్వరలో అదికూడా సెట్ అయిపోతుందన్నారు. కరీంనగర్‌ను అభివృద్ధి చేయడమే తనకు తెలుసన్నారు. జిల్లా అభివృద్ధి కోసం రాజకీయాలలకు అతీతంగా కలిసి పనిచేయాలని కోరుతున్నామన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం కంకణం కట్టుకున్నానన్నారు. కరీంనగర్‌లో నాలుగు వేల ఇండ్లకు నిరంతరాయంగా 24 గంటల పాటు నీళ్లు సరఫరాల అవుతాయన్నారు. పేదరికం నుంచి హర్యానా సీఎంగా, కేంద్రమంత్రిగా ఎదిగిన మనోహర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగడం ఎంతో గర్వకారణమన్నారు. కరీంనగర్‌లో డంప్ యార్డ్‌తో ప్రజలు అల్లాడిపోతున్నారని.. డంపింగ్ యార్డు సమస్య నుంచి కరీంనగర్ ప్రజలకు విముక్తి కల్పిస్తామన్నారు. స్మార్ట్ సిటీ నిధులను దారి మళ్లిస్తే కొట్లాడి సాధించినట్లు తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాదం స్కీంలో చేరుస్తున్నామని తెలిపారు. అలాగే కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను రామాయణ్ సర్క్యూట్‌లో చేరుస్తామన్నారు. సిరిసిల్ల, వంగర ప్రాంతాల్లో నవోదయ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని కూడా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం 10 ఏళ్లలో తెలంగాణకు 12 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, రోడ్ల కోసమే లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, రాష్ట్రంలోని 32 జిల్లాల్లో జాతీయ రహదారులను అభివృద్ధి చేశామని బండి సంజయ్ వెల్లడించారు.

# ఆధ్యాత్మిక పర్యాటకంగా భారత్



**ప్రయాగ్‌రాజ్:** 144 ఏళ్ల తర్వాత ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభ మేళాకు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. దీంతో విదేశీ టూరిజంలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. ముఖ్యంగా బారత్ లో జరిగే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అమెరికా, యూకే వంటి దేశాల నుంచి పర్యాటకులు పోటెత్తుతున్నారు. దీంతో భారత్ ఆధ్యాత్మిక పర్యాటకానికి కేంద్రంగా మారుతుందన్న సూచనలు కనిపిస్తున్నాయి..ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళకు దేశంలోనే కాకుండా ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. దేశంలోని మతపరమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు యేటా మిలియన్ల మంది పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల నుంచి దేశంలోని ఆధ్యాత్మిక కార్యక్రమాకు తరలి వస్తున్న పర్యాటకుల్లో 21.4 శాతం పెరుగుదల కనిపిస్తుంది. ప్రముఖ వీసా ప్రాసెసింగ్ ప్లాట్‌ఫాం అట్లీస్ నివేదికల ప్రకారం.. దాదాపు 48 శాతం ఆధ్యాత్మిక ప్రయాణ వీసా అప్లికేషన్లు మహా కుంభ్ వంటి పెద్ద ఈవెంట్‌లు, తీర్థయాత్రలకు లింక్ చేసినట్లు వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న మహా కుంభమేళా.. ప్రపంచంలోని అతిపెద్ద మతపరమైన కార్యక్రమాల్లో ఒకటి. 42 మిలియన్ల మంది యాత్రికులు కుంభ్ మేళాకు వస్తారని అంచనా. 144 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ కార్యక్రమం దేశీయ, అంతర్జాతీయ సందర్శకులకు, భక్తులకు బాగా కనెక్ట్ అయ్యింది. దీంతో జా, జఐ వంటి దేశాల నుంచి కూడా ఆధ్యాత్మిక పర్యాటకుల సంఖ్య కూడా ఎన్నో రెట్లు పెరిగింది. వీరిలో మంది ప్రామాణికమైన, జీవితాన్ని మార్చే అనుభవాల కోసం అన్వేషిస్తున్నారు. సహస్రాబ్ది ఆధ్యాత్మిక యాత్రికులలో 66? మంది మహిళలు ఈ మార్పుకు నాయకత్వం వహిస్తున్నారు. సాంప్రదాయ పర్యాటక కార్యకలాపాల కంటే ఆధ్యాత్మిక, అర్థవంతమైన ఈవెంట్ల కోసం ఎక్కువ మంది యువత సెలవులను కేటాయిస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకంలో కనిపించిన ఈ కొత్త ట్రెండ్.. గ్రూప్ ట్రావెల్ పట్ల ఆసక్తిని పెంచుతోంది. సమూహ ఆధ్యాత్మిక అనుభవాల కోసం ఇన్‌బౌండ్ ప్రయాణం కోసం ఏకంగా అప్లికేషన్లు 35 శాతం పెరిగాయట. గ్రూప్ టూరిజంలో భాగంగా పర్యాటకులు పవిత్ర ప్రదేశాలను సందర్శించినప్పుడు.. అక్కడి ఆచారాలలో పాల్గొనేందుకు అసక్తి చూసుతున్నారు. ముఖ్యంగా భారత్ ఆధ్యాత్మిక పర్యాటకం గత కొన్నేళ్లుగా బాగా పుంజుకుంది.

## యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలి : మాజీ ఎంపీ వినోద్‌కుమార్

**హైదరాబాద్:** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కొత్త నిబంధనలపై అనేక రాష్ట్రాలు నిరసన తెలుపుతున్నాయని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో కూడా యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం వినోద్ కుమార్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తమిళనాడు అసెంబ్లీ యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా తీర్మానం చేసి పంపింది. ఫెడరల్ స్ఫూర్తిని మంట గలుపుతున్నారని
తమిళనాడు సీఎం స్టాలిన్ కేంద్రప్రభుత్వంపై మండిపడ్డారు. కేరళ సీఎం కూడా యూజీసీ ప్రతిపాదనలను వ్యతిరేకించారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైనప్పటికీ జేడీయూకి చెందిన బీహార్ సీఎం నితీష్ కుమార్ కూడా యూజీసీ ప్రతిపాదనలు వ్యతిరేకించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంకా స్పందించలేదు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సీఎం అయినప్పటికీ యూజీసీ ముసాయిదాపై స్పందించడం లేదు. తెలంగాణ అసెంబ్లీలో యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

# ట్రంప్ దూకుడుపై తొలిదెబ్బ

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడిగా ఇటీవలే ప్రమాణం స్వీకారం చేసిన డొనాల్డ్ ట్రంప్ నిర్ణయానికి తొలిదెబ్బ తగిలింది. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా వచ్చే పౌరసత్వ హక్కు ను ట్రంప్ రద్దు చేసిన విషయం తెలిసిందే. దీనిపై అమెరికాలో సియాటిల్ ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రద్దు ఆదేశాలను న్యాయమూర్తి అడ్డుకున్నారు. ఆ ఆదేశాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ట్రంప్ నిర్ణయం రాజ్యంగ విరుద్ధమని పేర్కొన్నారు. జనవరి 20న యూఎస్ అధ్యక్షుడిగా ప్రమాణం స్వీకారం చేసిన వెంటనే ట్రంప్ పలు కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. పారిస్ ఒప్పందంతో పాటు డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదొలగడం, ప్రభుత్వ ఉద్యోగుల ఇంటి నుంచి పని విధానాన్ని రద్దు చేయడం, ప్రభుత్వ నియామకాలపై నిషేధం, క్యాపిటల్ హిల్‌పై దాడిచేసిన వారికి క్షమాభిక్ష పెట్టడం, వలస వచ్చిన వారి పిల్లలకు జన్మతః వచ్చే పౌరసత్వ రద్దు నిర్ణయం ఉన్నాయి. దీంతో ట్రంప్ నిర్ణయంపై డెమొక్రాట్‌ల నేతృత్వంలోని వాషింగ్టన్, అరిజోనా, ఇల్లినాయిస్, ఓరేగాన్ రాష్ట్రాలు కోర్టును సియాటిల్ ఫెడరల్ కోర్టును ఆశ్రయించాయి. అమెరికా రాజ్యాంగం 14వ సవరణ ప్రకారం.. పౌరసత్వ చట్టం నిబంధనలకు ట్రంప్ ఆదేశాలు వ్యతిరేకమని వాదించాయి. అమెరికాలో పుట్టిన ఎవరికైనా పౌరసత్వం లభిస్తుందని న్యాయవాదులు వాదించారు. దీంతో సియాటిల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ జాన్ కాఫ్నర్.. జన్మతః పౌరసత్వ రద్దు కార్యనిర్వాహక ఆదేశాలను తాత్కాలికంగా నిలుపుదల వేస్తూ తీర్పు ఇచ్చారు. ఇక పౌరసత్వ రద్దుకు సంబంధించి ఇప్పటికే 22 రాష్ట్రాలు, పలు పౌరసంఘాలు కోర్టుల్లో పలు దావాలు వేశాయి.

# పసిడి ధరలు మరింత పైపైకి

## 83వేలు దాటిన పదిగ్రాముల బంగారం ధర

**న్యూఢిల్లీ:** బంగారం ధర మరోమారు అందనంతంగా అమాంతంగా మరింత పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో దీనికి భారీగా డిమాండ్ ఏర్పడింది. దీంతో దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల పసిడి ధర రూ.83 వేలు దాటింది. ఈ మార్కు దాటడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 99.9 స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడి రూ.200 పెరిగి రూ.83,100కి చేరుకున్నట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం కూడా రూ.200 పెరిగి రూ.82,700కి చేరినట్లు అసోసియేషన్ పేర్కొంది. అటు వెండి సైతం కిలోకు రూ.500 మేర పెరిగింది. క్రితం ట్రేడింగ్‌లో రూ.93,500గా ఉన్న వెండి కిలో తాజాగా రూ.94 వేల మార్కుకు చేరుకుంది. అంతర్జాతీయ విపణిలో బంగారం ఔన్సు 2780 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 31.32 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్ టారిఫ్‌ల విషయంలో ఎలా వ్యవహరిస్తారనే అంశంపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. ఎన్నికల వేళ ప్రపంచ ఆర్థికంపై ప్రభావం చూపేలా వ్యాఖ్యలు చేసిన ట్రంప్.. ఇతర అంశాల్లోనూ ముమ్మందు ఎలా వ్యవహరిస్తారనే దానిపైనా ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనంగా పసిడిని భావిస్తుండడంతో దీనికి డిమాండ్ పెరుగుతోందని యాక్సిస్ సెక్యూరిటీస్‌లో రీసెర్చ్ అనలిస్ట్ దేవేయ గగలానీ అభిప్రాయపడ్డారు. కేంద్రం ప్రవేశపెట్టనున్న బడ్జెట్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయాలు ముమ్మందు బులియన్ మార్కెట్లో బంగారం ధర గమనాన్ని నిర్దేశిరచనున్నాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన అనలిస్ట్ జతిన్ త్రివేది పేర్కొన్నారు.

# మెగా కృష్ణారెడ్డి కోసం దావోస్ వెళ్లాలా?

**హైదరాబాద్:** మెగా కృష్ణారెడ్డి కంపెనీతో ఒప్పందానికి దావోస్ వెళ్ళాలా... అంటూ సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు చురకలంటించారు. జూబ్లీహిల్స్‌లో రోడ్డుకు అటు వైపు సీఎం రేవంత్ రెడ్డి ఉంటారని.. ఇటు వైపు మెగా కృష్ణారెడ్డి ఉంటారని వివరించారు. దావోస్ టూర్‌కు సీఎం రేవంత్ రెడ్డి దారి ఖర్చులు వృధా చేశారని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే హరీష్ రావు విలేకర్లతో మాట్లాడుతూ.. గోదావరి జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకి అన్యాయం జరుగుతుంటే.. రేవంత్ సర్కార్ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ నిప్పులు చెరిగారు. ఏపీని ఆపడం చేతకాకుంటే.. అఖిల పక్షాన్ని తీసుకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు సూచించారు. ఈ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి.. గురదక్షిణ చెల్లించుకొంటున్నట్లు అనుమానం కలుగుతోందని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకు పోతుంటే.. రేవంత్ రెడ్డి మౌనంగా ఉండడం వెనుక కారణం ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి విషయంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని హరీశ్‌రావు మండిపడ్డారు. గోదావరి నీళ్లను పెన్నాకు తీసుకెళ్లేందుకు ఏపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది అని హరీశ్‌రావు తెలిపారు. గోదావరి నీళ్లను ఏపీకి తీసుకెళ్తుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది..? బనకచర్ల ఆపాలని ఏపీకి కనీసం లేఖ కూడా రాయలేదు సీఎం రేవంత్ రెడ్డి. నాలుగు ప్రాజెక్టులకు నీళ్ల కేటాయింపులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టులకు అనుమతుల సాధనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. బనకచర్లకు నిధుల కోసం చంద్రబాబు కేంద్రానికి లేఖలు రాశారు. చంద్రబాబు లేఖపై కేంద్రంలో దస్త్రం కదులుతోంది. చంద్రబాబు నవంబర్‌లో లేఖ రాస్తే సీఎం రేవంత్ ఏం చేశారు..? బనకచర్లపై ఏపీ ముందుకెళ్తుంటే సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు..? బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుంది. బనకచర్లపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది అని హరీశ్‌రావు మండిపడ్డారు. కృష్ణా జలాల విషయంలో సెక్షన్ 3ని సాధించిందే కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని హరీశ్‌రావు తెలిపారు. ఇప్పుడు సెక్షన్ 3పై ఏపీ సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఏపీ సుప్రీంకోర్టుకు వెళ్తే కనీసం కేవియట్ వేయరా..? ప్రభుత్వాన్ని అధికారులు సరిగ్గా మార్గదర్శకత్వం చేయట్లేదు. మంచి అడ్వకేట్లను పెట్టి సెక్షన్ 3 విషయంలో వాదించాలి కదా..? సాగునీటి మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి విఫలమయ్యారు. మేడిగడ్డను పండబెట్టారు.. పాలమూరును పక్కకు పెట్టారు. ఇప్పటికైనా నదీ జలాలపై రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి.



# జామ్‌నగర్‌లో అతిపెద్ద డేటా సెటర్ ?

## రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ యోచన

ముంబై: దావోస్ సదస్సులో పలు దిగ్గజ కంపెనీలో భారత్‌లో డేటా సెంటర్‌ల ఏర్పాటుకు ఒప్పందాలు చేసుకున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద డేటా సంటర్లకు ఒప్పందాలు జరిగాయి. ఇదే సమయంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌ను భారత్‌లో నిర్మించాలని చూస్తున్నారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో దీన్ని ఏర్పాటు చేయాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే ఇదో పెద్ద విప్లవాత్మక అడుగుగా భావించాలి. దీని కోసం ఎన్విడియా నుంచి అధునాతన ఏఐ చిప్‌లను కొనుగోలు చేయనుంది. ఈ డేటా సెంటర్ మూడు గిగావాట్స్ సామర్థ్యంతో ఏర్పాటు కావచ్చుని అంచనాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా టెక్ దిగ్గజ సంస్థలైన మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్.. ఏఐ సేవల కోసం డేటా సెంటర్ సామర్థ్యాలను విస్తరించాలని చూస్తున్నాయి. దీని కోసం భారీగా ఖర్చు చేస్తున్నాయి. తాజాగా ఓపెన్ ఏఐ, సాఫ్ట్ బ్యాంక్, ఒరాకిల్ సంయుక్తంగా ఓ భారీ కృత్రిమ మేధ ప్రాజెక్టుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. స్టార్‌గేట్ ప్రాజెక్ట్ కోసం 500 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టే ప్రణాళికలను కూడా ప్రకటించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని అంబానీ చూస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీని నిర్మాణ పనులు అనుకొన్నట్లే ముందుకు సాగితే ప్రస్తుతం ఈ విభాగంలో భారత్ సామర్థ్యాలు పెరుగుతాయి.

# రజాకార్ మూవీని తప్పకుండా చూడాలి

**కరీంనగర్:** తెలంగాణ సాయిధ పోరాటంలో అమరులైన యోధుల కథతో తెరకెక్కిన చిత్రం రజాకార్. అప్పటి రజాకర్ల దురాగతాలను అణచివేసి హైదరాబాద్‌ను ఇండియాలో విలీనం చేసేందుకు పటేల్ చేసిన ప్రయత్నాలను ఈ మూవీలో చూపించారు. గతేడాది మార్చి 15న థియేటర్లలో
విడుదలైన ఈ సినిమా పర్వాలేదనిపించింది. అదే సమయంలో ఈ సినిమా ఎన్నో వివాదాలు ఎదుర్కొంది. కొన్ని రాజకీయ పార్టీలు రజకార్ సినిమాకు అనుకూలంగా మాట్లాడితే మరికొన్నిపొలిటికల్ పార్టీలు ఈ మూవీపై మండిపడ్డాయి. ఇలా ఎన్నో వివాదాలు ఎదుర్కొన్న రజకార్ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. థియేటర్లలో విడుదలైన సుమారు 9 నెలల తర్వాత ఈ మూవీ ఓటీటీలోకి రావడం విశేషం. ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్ ఫామ్ ఆహా లో ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నేపథ్యంలో రజాకార్ సినిమాపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశంసలు కురిపించారు. అందరూ తప్పకుండా ఈ సినిమాను చూడాలని కోరారు. 'కాలం దాచిన తెలంగాణ విముక్తి పోరాటాన్ని, మన తెలంగాణ పోరాట యోధుల చరిత్రను అత్యద్భుతంగా తెరకెక్కించిన సినిమా ఇది.రజాకార్ల దురాగతాలను ఎదురించడానికి ప్రజలే సాయుధులై కదన రంగం లో దిగిన యదార్థ కథ ఇది. చరిత్ర పుటల్లో దాగిన ఈ నెత్తురు జీవితాలను కళ్ళకు కట్టినట్లు చూపిన సినిమా రజాకార్. నిజాం హయాంలో జరిగిన మారణ హోమాన్ని, హిందువులపై జరిగిన దౌర్జన్యాలను, బలవంతపు మత మార్పిడులను అడ్డుకునేందుకు ప్రజలే సాయుధులై ఎలా
పోరాటం చేశారో ఈ రజాకార్ సినిమాలో చూపించారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నేటి తరానికి అందించాలనే ఉద్దేశంతో అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి, ఆర్థిక నష్టాలు ఎదురైనా భయపడకుండా గూడూరు నారాయణ రెడ్డి గారు నిర్మించిన గొప్ప సినిమా రజాకార్ సినిమా శుక్రవారం ఆహా లో ప్రసారమవుతోంది. ప్రతి ఒక్కరూ ఈ సినిమా చూడాలని కోరుతున్నా. ముఖ్యంగా ప్రతీ హిందువు తప్పకుండా ఈ మూవీ చూడాలని కోరుతున్నా' అని బండి సంజయ్ చెప్పుకొచ్చారు.

# విద్యతోనే బాలికల భవిష్యత్తులో మార్పు.









**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 24:**

విద్యతోనే బాలికల భవిష్యత్తులో మార్పు సాధ్యం అవుతుందని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. అంట్లు తోమే స్థాయి నుండి నేడు అంతరిక్షానికి వెళ్ళే స్థాయికి మహిళలు ఎదిగారని, కానీ అక్కడక్కడ ఇంకా వివక్షత కూడా కొనసాగుతుందని అన్నారు. మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని, భేటీ భచావో భేటీ పడావో కార్యక్రమం ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తి ఐన సందర్భంగా స్పోర్ట్స్ గ్రౌండ్ నుండి న్యూ అంబేద్కర్ భవన్ వరకు విద్యార్థినిలచే ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించి, న్యూ అంబేద్కర్ భవనములో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త పాల్గొనీ, మాట్లాడారు. ఆడపిల్లలు మహిళలు అంటే గతం లో చిన్న చూపు చూసే వారని ప్రస్తుతం ప్రభుత్వాలు ఆడపిల్లలు మహిళల సంక్షేమానికి అనేక పథకాలు ప్రారంభించడం అనేక రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. బాల్య వివాహాలు అరికట్టడం లో ఇంకా ఎక్కువ సమన్వయం తో పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు, నగర మేయర్ దండు నీతూ కిరణ్ మాట్లాడుతూ, ఆడపిల్లలు, మహిళలు ఎదగడానికి కుటుంబ సభ్యుల సహకారం చాలా అవసరం అని అన్నారు. మహిళా కమిషన్ మెంబర్ సుదాం లక్ష్మీ మాట్లాడుతూ, పిల్లలకు ఫోన్ లు దూరముగా పెట్టాలని, బాలబాలికల మధ్య వివక్షతను రూపుమాపాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి యస్ కే రసూల్ బి మాట్లాడుతూ, యునిసెఫ్ నివేదిక ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న ఆడపిల్లలకు 40 శాతం పెళ్ళిళ్ళు జరుగుతున్నాయని, 15 సంవత్సరాల లోపు ఉన్న ఆడపిల్లలకు 12 శాతం పెళ్ళిళ్ళు జరుగుతున్నాయని, 25 సంవత్సరాల లోపు ఉన్న ఆడపిల్లలకు 30 శాతం మాత్రమే పెళ్ళిళ్ళు జరుగుతున్నాయని దీనిని పెంచాలని అన్నారు.
డియం అండ్ హెచ్ వో రాజశ్రీ మాట్లాడుతూ, ఆరోగ్య శాఖా వారి అద్వర్యములో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమములో అల్ ఇండియా రేడియొ డి డి మోహన్ దాస్, జిఈసిఓ భాగ్యలక్ష్మి, డిఎంసి మాధవి సిడిపివోలు, సూపర్ వైజర్ లు పాల్గొన్నారు. కాగా కార్యక్రమము ప్రారంభములో జెడ్పి హెచ్ సి, మల్లారం, మానవతా సదన్, విజయ్ పబ్లిక్ స్కూల్, మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థినిలు ఆడపిల్లల,
మహిళల పై జరుగుతున్న అత్యాచారాలు, అన్యాయాలపై చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలోచింప చేశాయి.

# నిజాయితీ, సమయపాలన విజయ సోపానాలు.

**ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నక్షత్రం సత్యనారాయణ స్వామి.**

**సారంగపూర్ జడ్పీహెచ్ఎస్ లో ఎస్ఎస్ సి విద్యార్థులకు జీవన కలల నైపుణ్యాలపై శిక్షణ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 24**



సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, ప్రతి పనిని నిజాయితీగా పూర్తి చేయడం, నేర్చుకున్న జ్ఞానాన్ని జీవితంలో ఉపయోగించడం మనిషిని విజయ తీరాలకు చేరుస్తాయని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నక్షత్రం సత్యనారాయణ స్వామి అన్నారు. శుక్రవారం సారంగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జీవన కలల నైపుణ్యాలపై ఆయన శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణ స్వామి మాట్లాడుతూ, చదువుతో సమాజంలో గౌరవం వస్తుందని, చదువుతో వచ్చిన సంస్కారం వల్ల మంచి కుటుంబాలు ఏర్పడతాయని తద్వారా దేశంలో సంస్కారం వెల్లి విరుస్తుందని తెలిపారు. పదవ తరగతిలో విజయం సాధించాలంటే పూర్తి అయిన సిలబస్ ను ఒక ప్రణాళిక వేసుకుని, పునఃశ్చరణ చేసుకోవాలని, అందులో నిజాయితీ ముఖ్యమని సోదాహరణంగా వివరించారు. చదువు అంటే కేవలం విద్యార్థులకు మేలు చేసేది కాదని, విద్యార్థుల కుటుంబానికి, నివసిస్తున్న ఊరికి సమాజంలో గొప్ప స్థానం కలిగిస్తుందని ఆయన అన్నారు. అలసట వచ్చినప్పుడు కొంత రెస్టు తీసుకుని మెదడుకు స్ట్రెస్ రాకుండా చూసుకోవాలని విద్యార్థులకు సూచించారు. మార్కులు సంపాదించడం కన్నా జ్ఞానం సంపాదించడంపై ప్రధాన దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే. లలిత, ఉపాధ్యాయులు డాక్టర్ సల్ల సత్యనారాయణ, డి గోపాల్, మహమ్మద్ జావిద్, సిహెచ్ విద్యాసాగర్, ఘనపురం దేవేందర్, డాక్టర్ ఎస్ గంగాధర్, రంగు కృష్ణంరాజు, శ్రీలత, సుజాత అనిత, లలిత, స్వరూప పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ" వెయ్యి కోసం ఇద్దరు స్నేహితులని హతమార్చారు.

**- నిందితుల్ని అరెస్టు చేసిన పోలీసులు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 24:**




రూ.వెయ్యి కోసం ఒకరిని, అతని ఆచూకీ అడిగినందుకు మరొకరిని స్నేహితులే కడతేర్చిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఎండీ అమర్‌ఖాన్, రియాజ్ ఖాన్, మహ్మద్ బహదూర్, సయ్యద్ యూసుఫ్ నలుగురు స్నేహితులు. శ్మశానాల్లో కాలిన చితిలలో బంగారు, వెండి ఆభరణాలు వెతుకుతూ గడిపేవారు. ఈ క్రమంలో ఈనెల 18న అమర్‌ఖాన్, రియాజ్‌ఖాన్, బహదూర్‌లు కలిసి బైక్‌పై ఆర్మూర్ రోడ్డుతో పాటు గూపన్‌పల్లి శ్మశానవాటికకు వెళ్లారు. ఈ క్రమంలో బహదూర్ మద్యం కోసం రూ.వెయ్యి ఖర్చు చేశాడు. అయితే, రెండు చోట్లా ఏమీ దొరక్కపోవడంతో అమర్, రియాజ్‌లు బహదూర్‌తో గొడవపడి తలపై కట్టెతో కొట్టి హత్యచేసి నీటిలో పడేసి వెళ్లిపోయారు. మరుసటి రోజు మరో
స్నేహితుడైన యూసుఫ్ మిగతా ఇద్దరిని బహదూర్ గురించి అడిగాడు. దీంతో హత్య విషయం బయటకు వస్తుందనే భయంతో యూసుఫ్‌ను సైతం నమ్మించి బాబన్ సాబ్ పహాడ్‌లోని జాలి తలాబ్‌కు తీసుకెళ్లారు. స్నానం చేస్తున్నట్లు నటించి అతన్ని నీటిలో ముంచి చంపేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు.

# స్కౌట్స్ వజ్రోత్సవ జాతీయ జాంబోరీకి "సత్యశోధక్" విద్యార్థులు.



**వేగుచుక్క న్యూస్, సిరికొండ, జనవరి 24**

: తమిళనాడు రాష్ట్రం తిరుచిలో ఈ నెల 28 నుండి జరిగే స్కౌట్స్ అండ్ గైడ్స్ వజ్రోత్సవ జాతీయ జాంబోరీకి సత్యశోధక్ పాఠశాలకు చెందిన 8మంది విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన స్కౌట్స్ డి. శ్రీనాథ్, పి. యశ్వంత్, ఎ. శ్రీకాంత్, జి. అద్వైత్, గైడ్స్ బి. భవ్యశ్రీ, సి. హెచ్. కృతిక, డి. శ్రీజ, పి. నవ్యశ్రీ లు ఎంపికైనారు. వీరు శుక్రవారం నుండి ఆదివారం వరకు హైదరాబాద్ లోని జీడిమెట్ల స్కౌట్స్ ,గైడ్స్ రాష్ట్ర శిక్షణ కేంద్రంలో జాంబోరీ సంసిద్ధ శిబిరంలో పాల్గొని వివిధ అంశాలలో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో స్కౌట్స్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె. సాల్మన్, ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య లు అభినందించారు. సంసిద్ధ శిబిరంలో నైపుణ్యతను ప్రదర్శించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, గైడ్ కెప్టెన్ యస్. వనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి అబాకస్ పోటీలలో "సత్యశోధక్" విద్యార్థుల ప్రతిభ.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, జనవరి 24:**

విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ లాబ్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలలో సత్యశోధక్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఎనిమిది మంది విద్యార్థులు జిల్లా ఛాంపియన్లుగా నిలిచి అవార్డులను సాధించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదాన్నగారి విటల్ రావు, ప్రముఖ మేజిషన్ రంగనాథ్ లు ప్రత్యేక బహుమతులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా దాదాన్నగారి విఠల్ రావు మాట్లాడుతూ, నేటి సమాజంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి గణితశాస్త్రం మూలమని విద్యార్థులు గణితం పైన పట్టు సాధించుటకు అబాకస్, వేదిక్ మ్యాథ్స్ లో శిక్షణ




దోహదపడుతుందన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు గణిత అంటే భయాన్ని తొలగించి సులభమైన పద్దతిలో అర్థం అయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నిరంతర సాధన పోటీ పరీక్షలలో విద్యార్థులను విజయం సాధించేలా చేస్తుందన్నారు. అబాకస్ వివిధ విభాగాలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు యన్. ప్రణిక్ష , యన్. కార్తీక, కె.అనణ్య పాటిల్,యన్.అవంతిక, వి. సాద్వి (విజివలైజేషన్ )లు, వేదిక్ మ్యాథ్స్ వివిధ విభాగాలలో బి. భవ్యశ్రీ, శ్రీకాంత్, అద్వైత్ లు ఛాంపియన్ షిప్ సాధించారు. వీరితో పాటు ఎ. జానకి, కె. రుగ్వేద, టి. శివాని, సి. హెచ్. కృతిక, యస్. అభినాష్ లు ప్రోత్సాహక బహుమతులు పొందడమైనది. పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి ఛాంపియన్ షిప్ అవార్డులు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మేజిషన్ రంగనాథ్, ట్రస్మా రాష్ట్ర సలహాదారులు ఎం. మోహన్, నగర అధ్యక్షులు నాగరాజు విశ్వం ఎడ్యుటెక్ ప్రతినిధులు మారుతి, వినాయక్, శివ పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

వేగుచుక్క

# నేను బ్లాక్‌లో తీసుకోను..



వెంకటేష్, అనిల్ రావిపూడి పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఆ సమయంలోనే హీరోలు ఎక్కువ పారితోషికం గురించి వెంకటేష్ స్పందించారు. ఆయన ఫన్నీగా మాట్లాడుతూ తాను తీసుకునేది తక్కువే.. అది కూడా ఫుల్ వైట్ మనీగానే తీసుకుంటాను అన్నారు.

2025 సంక్రాంతి కానుకగా వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా మొదటి వారం రోజుల్లో రూ.230 కోట్ల వసూళ్లు రాబట్టింది. కేవలం తెలుగులో విడుదల అయ్యి ఈ స్థాయి వసూళ్లు సాధించడం రికార్డ్‌గా చెప్పుకోవచ్చు. తెలుగులో మాత్రమే విడుదల అయ్యి పాన్ ఇండియా సినిమాల రేంజ్‌లో వసూళ్లు సాధిస్తున్న ఈ సినిమాకి సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేశారు. దిల్ రాజు ఐటీ రైట్స్ జరుగుతున్న కారణంగా ఈ మీడియా సమావేశంకు హాజరు కాలేదు. హీరోయిన్స్ ఇద్దరూ మొన్నటి వరకు హైదరాబాద్‌లో ఉండి వెళ్లి పోయారు. దాంతో ఈ సక్సెస్ మీట్‌లో హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు భీమ్స్ పాలు పాల్గొన్నారు.

సినిమా సక్సెస్ నేపథ్యంలో మీడియాతో తమ అనుభవాలను, సంతోషాన్ని పంచుకున్నారు. ఆ సమయంలో రిపోర్టర్స్ పలు ప్రశ్నలను వీరిని అడిగారు. వెంకటేష్ గారితో ఒక రిపోర్టర్... ఐటీ రైడ్స్ గురించి నిర్మాతలతో మాట్లాడిన సమయంలో హీరోలు కనుక తమ పారితోషికంను మొత్తం వైట్ తీసుకుంటే ఏ నిర్మాత బ్లాక్ మనీ ఇవ్వాల్సిన అవసరం లేదు అంటున్నారు.. దీనిపై మీ అభిప్రాయం ఏంటని ప్రశ్నించారు. అందుకు వెంకటేష్ స్పందిస్తూ.. ఇతర హీరోల విషయం తనకు తెలియదు కానీ, తాను మాత్రం ఫుల్ వైట్. తీసుకునేది కొంచమే, ఎక్కువ తీసుకోను.. అదీ ఆఫీస్ వాళ్లు తీసుకుంటారు అన్నారు. తాను పారితోషికం ఎక్కువ తీసుకోనని, తీసుకునే కొంత మొత్తాన్ని పూర్తిగా వైట్ మనీగా తీసుకుంటానని వెంకటేష్ క్లియర్‌గా చెప్పుకొచ్చారు.

ఈమధ్య కాలంలో యంగ్ స్టార్ హీరోలు వందల కోట్ల పారితోషికాలు అందుకుంటున్న కారణంగా వారు కొంత మొత్తాన్ని బ్లాక్ మనీగా తీసుకుంటారనే టాక్ ఉంది. బ్లాక్ మనీగా తీసుకున్న పారితోషికంకు ట్యాక్స్ కట్టాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వం విధించే పన్నును తప్పించుకునేందుకు బ్లాక్ మనీగా పారితోషికం తీసుకుని దాన్ని ఇతర మార్గాల ద్వారా వైట్ చేస్తూ ఉంటారని ఇండస్ట్రీలో కొందరు అంటూ ఉంటారు. ఏ హీరోలు అలా తీసుకుంటారో కానీ సీనియర్ హీరోలు, కొద్ది మంది మీడియం రేంజ్ పారితోషికం తీసుకునే వారు అలా బ్లాక్ మనీ తీసుకోరని వెంకటేష్ గారి మాటలను బట్టి క్లారిటీ వచ్చేసింది.

ఈ విషయం గురించి ప్రముఖంగా చర్చలు జరుగుతున్నాయి. నిర్మాతలు స్టార్స్‌కి ఇచ్చే పారితోషికాలు, చెబుతున్న కలెక్షన్స్, కడుతున్న పన్నులు వీటన్నింటి లెక్కలు సరిపోవడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. కొన్ని సార్లు బ్లాక్ మనీని సినిమాల నిర్మాణంకు వినియోగించడం, ఎక్కువ వచ్చిన వసూళ్లను బ్లాక్ మనీగా మార్చి తక్కువగా చూపించుకోవడం కొందరు చేస్తూ ఉంటారట.

# నా వాదన కూడా వినడం లేదు



పూనమ్ కౌర్ తాజాగా ఓ మీడియా సంస్థతో మాట్లాడింది. అందులో మా అసోసియేషన్ గురించి స్పందించింది. శివ బాలాజీ చేసిన కామెంట్లకు కౌంటర్ వేసింది. ఓ మహిళగా.. మా అసోసియేషన్‌లోని మహిళా మెంబర్‌తోనే మాట్లాడతాను అని, శివ బాలాజీ లాంటి వారు ఈ మ్యాటర్‌లో ఇన్వాల్వ్ కాకపోతే బెటర్ అన్నట్టుగా కౌంటర్లు వేసింది. ఆల్రెడీ ఝాన్సీతో తాను మాట్లాడానని పూనమ్ కౌర్ క్లారిటీ ఇచ్చింది.

పూనమ్ కౌర్ తనకు జరిగిన అన్యాయం గురించి ఎప్పుడూ పూర్తిగా బయటపెట్టలేదు. మా అసోసియేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఇంత వరకు యాక్షన్ తీసుకోలేదంటూ ఆ మధ్య మండిపడింది. మా అసోసియేషన్‌కు పూనమ్ కౌర్ నుంచి ఎలాంటి కంప్లైంట్స్ రాలేదని శివ బాలాజీ చెప్పిన సంగతి తెలిసిందే. ఆమె పోలీసుల్ని లేదా.. మా అసోసియేషన్‌కు వచ్చి కంప్లైంట్ ఇస్తే ఏమైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, ఇలా సోషల్ మీడియాలో ట్వీట్లు వేస్తే ఎలాంటి లాభం ఉండదని శివ బాలాజీ చెప్పిన సంగతి తెలిసిందే.

ఇక పూనమ్ కౌర్ తాజాగా కొన్ని విషయాల్ని పంచుకుంది. ఓ అసోసియేషన్‌గా అన్ని విషయాలను పరిగణలోకి తీసుకుని, అందరి వాదనలు వినాలి అని చెప్పుకొచ్చింది. కనీసం నా వాదన కూడా వినరు.. నేను చెప్పింది కూడా పట్టించుకోరు.. నేను చెప్పింది విని.. నాది తప్పో, ఒప్పో చెప్పాలి.. అన్నీ తెలుసుకుని మాట్లాడాలి.. ఓ నిర్ణయాన్ని చెప్పాలి.. నా ఫ్యామిలీ ఎంత బాధ పడిందో.. మా అమ్మ ఎంతగా విసిగిపోయిందో నాకు తెలుసు..

నాకు ఈ పాలిటిక్స్ తెలియవు.. నన్ను ఎంతో మంది ఎన్నో రకాలుగా విమర్శించారు.. కానీ నేను ఏనాడూ ఏడ్చి విషయాన్ని రాద్ధాంతం చేయలేదు.. నేను ఏడ్చేందుకు, సానుభూతి కోసం రాలేదు.. సమస్యను పరిష్కరించుకునేందుకు ఇక్కడ ఉన్నాను.. నేను ఓ మహిళను.. ఇది మహిళా సమస్య.. మహిళా సభ్యురాలితోనే నేను మాట్లాడతాను.. ఆల్రెడీ ఝాన్సీ గారితో సమస్యను చెప్పాను.. అంటూ పూనమ్ కౌర్ ఓ మీడియాతో మాట్లాడింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట్లో వైరల్ అవుతోంది.

పూనమ్ కౌర్ త్రివిక్రమ్ ఇష్యూ మీద గత కొన్నేళ్లుగా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. సోషల్ మీడియా వేదికగా గత కొన్నేళ్లలో పూనమ్ కౌర్ వేసే కౌంటర్లు అందరికీ తెలిసిందే.



# ఇంకా ఎక్కువ హార్డ్ వర్క్ చేయి'..

సంక్రాంతికి వచ్చిన మూడు సినిమాల్లో 'సంక్రాంతికి వస్తున్నాం' బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. మేకర్స్ సైతం ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. కేవలం ఆరు రోజుల్లోనే రూ.100 కోట్ల షేర్‌ను రాబట్టింది. లాంగ్ రన్‌లో ఈ సినిమా వసూళ్లు ఎక్కడి వరకు వెళ్లి ఆగుతాయని ఎవరూ అంచనా వేయలేక పోతున్నారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో హిట్ కొట్టిన అనిల్ రావిపూడి తదుపరి సినిమాను చిరంజీవితో చేయబోతున్న విషయం తెల్సిందే. దాంతో సంక్రాంతికి వస్తున్నాం సక్సెస్‌పై చిరంజీవి స్పందన ఏంటా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాజాగా దర్శకుడు ఆ విషయమై స్పందించారు.

సంక్రాంతి కానుకగా వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. మొదటి ఆరు రోజుల్లోనే రూ.100 కోట్ల షేర్‌ను రాబట్టడంతో పాటు ఇప్పటికే సినిమా దాదాపుగా రూ.250 కోట్ల వసూళ్లు రాబట్టింది. లాంగ్ రన్‌లో ఈ సినిమా ఏ స్థాయి వసూళ్లు సాధిస్తుందా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎఫ్ 2 స్థాయి వసూళ్లు రాబడితే చాలు అనుకున్నామని కానీ ఈ సినిమాకు దాదాపుగా అంతకు రెట్టింపు వసూళ్లు నమోదు అవుతున్నాయని దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పుకొచ్చారు. ప్రేక్షకులు ఈ సినిమాకి ఈ స్థాయి విజయాన్ని అందిస్తారని కనీసం ఊహించలేదని దర్శకుడు అన్నారు.

సినిమాకు బ్లాక్ బస్టర్ సక్సెస్ దక్కడంతో దర్శకుడు అనిల్ రావిపూడి పోస్ట్ రిలీజ్ ప్రమోషన్స్‌తోనూ దూసుకు పోతున్నారు. సినిమా విడుదల తర్వాత వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ సినిమా కోసం తాను అనుకున్న నటీనటులను, సాంకేతిక నిపుణులను తీసుకున్నాను. ఎక్కడా రాజీ పడాల్సిన అవసరం రాలేదని అన్నారు. నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ గారు తనకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని, బడ్జెట్ విషయంలో తాను అనుకున్న దానికి వారు ఓకే చెప్పారని అన్నారు. నిర్మాతలు తనపై చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ వారు ఎన్నో గొప్ప విజయాలను అందుకున్నారు, నాపై వారు చూపించే అభిమానంతో అలా మాట్లాడారని చెప్పుకొచ్చారు.

అనిల్ రావిపూడి తదుపరి సినిమాను మెగాస్టార్ చిరంజీవితో చేయబోతున్న విషయం తెల్సిందే. కనుక సంక్రాంతికి వస్తున్నాం సినిమాపై మెగాస్టార్ రియాక్షన్ ఏమై ఉంటుంది అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాజాగా దర్శకుడు అనిల్ రావిపూడి ఆ విషయమై స్పందిస్తూ... చిరంజీవి గారు ఊర్లో లేరు. ఆయన సినిమా రిజల్ట్ గురించి తెలిసి నాకు మెసేజ్ చేశారు. చాలా సంతోషంగా ఉంది, మన సినిమాకు ఇంకా ఎక్కువ హార్డ్ వర్క్ చేయి అని చెప్పారు. సినిమా చూసి ఉంటే తప్పకుండా ఫోన్ చేసి మరిన్ని విషయాలను ఆయన చెప్పేవారు. ఈ సినిమా ఫలితంతో ఆయన చాలా సంతోషంగా ఉన్నారని అనిల్ రావిపూడి పేర్కొన్నారు.

సంక్రాంతికి వస్తున్నాం సినిమా విడుదలకు ముందే చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబో కన్ఫర్మ్ అయ్యింది. ఈ సినిమా హిట్ కావడంతో మరో ఆలోచన లేకుండా మెగాస్టార్ వెంటనే అనిల్ రావిపూడికి డేట్లు ఇస్తే బాగుంటుంది అంటూ మెగా ఫ్యాన్స్ సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఒక మాస్ మసాలా, ఫన్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా మెగాస్టార్ చిరంజీవి సినిమా రావాలని అన్ని వర్గాల ప్రేక్షకులు కోరుకుంటున్నారు. చిరంజీవితో సినిమాను సమ్మర్‌లో మొదలు పెట్టి వచ్చే ఏడాది సంక్రాంతికి అనిల్ రావిపూడి సినిమాను తీసుకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే చిరంజీవితో సినిమాను అనిల్ అంత స్పీడ్‌గా తీయగలరా అనే అనుమానాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు.

# కమల్, కిచ్చా సుదీప్ బాటలో నాగార్జున..

11 ఏళ్ల బిగ్ బాస్ జర్నీకి స్వస్తి పలుకుతూ.. కన్నడ బిగ్ బాస్ హోస్టింగ్‌కి గుడ్ బై చెప్పేశారు కిచ్చా సుదీప్. ఇక కన్నడలో బిగ్ బాస్ సూపర్ సక్సెస్ కావడంతో.. తెలుగు, తమిళ్‌లో ఒకేసారి ప్రారంభించారు. 2017 జూలై 16న ఎన్టీఆర్ హోస్ట్‌గా తెలుగులో బిగ్ బాస్ ప్రారంభమైంది. అదే ఏడాది సెప్టెంబర్ 30 తమిళ బిగ్ బాస్ ప్రారంభం కాగా.. లోకనాయకుడు కమల్ హాసన్ తమిళ్ బిగ్ బాస్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు.

అయితే తెలుగులో ముగ్గురు హోస్ట్‌లు మారారు కానీ.. తమిళ్‌లో మాత్రం.. సీజన్ 7 వరకూ కమల్ హాసన్ వరుసగా హోస్టింగ్ చేశారు. అయితే ఏడు సీజన్లకు హోస్ట్‌గా వ్యవహరించిన కమల్ హాసన్.. ఎనిమిదో సీజన్ ప్రారంభానికి ముందు.. బిగ్ బాస్ హోస్ట్‌గా తప్పుకున్నారు. దాంతో చివరి నిమిషంలో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి బిగ్ బాస్ సీజన్ 8 హోస్ట్‌గా బుల్లితెరపై రంగ ప్రవేశం చేశారు. కొత్తనీరు రాకతో పాతనీరు పోతుందన్నట్టుగా.. కమల్ హాసన్ లేకపోతే బిగ్ బాస్ షోనే లేదు అనే పరిస్థితి నుంచి.. ఒక్క సీజన్‌తోనే కమల్ కంటే బాగానే చేశారు అని ప్రశంసలు అందుకున్నారు విజయ్ సేతుపతి. రియాలిటీ షోలో రియల్ హోస్ట్ ఎలా వ్యవహరించాలో అలాగే వ్యవహరిస్తూ ఒక్క సీజన్‌తోనే బెస్ట్ హోస్టింగ్‌గా మంచి మార్కులు అందుకున్నారు విజయ్ సేతుపతి.

అయితే అటు తమిళ్‌లో.. ఇటు కన్నడలో.. కమల్ హాసన్‌ని కానీ.. కిచ్చా సుదీప్‌ని కానీ.. ఆయా ఛానల్స్ తప్పించలేదు. వాళ్లే తమంతట తాము తప్పుకున్నారు. ఎందుకంటే.. బిగ్ బాస్ షో వల్ల వచ్చిన మంచి పేరుకంటే.. జరిగే డ్యామేజ్ ఎక్కువ ఉండటంతో పూర్తి డ్యామేజ్ జరగకముందే తప్పుకోవడం మంచిదనే ఉద్దేశంతో ముందే తప్పుకున్నారు.

కానీ తెలుగులో హోస్ట్ నాగార్జునకి కమల్, సుదీప్‌లకంటే ఎక్కువ డ్యామేజ్ జరిగింది. నిజానికి హీరోగా నాగార్జునకి క్లీన్ ఇమేజ్ ఉంది. కానీ ఎప్పుడైతే బిగ్ బాస్ హోస్టింగ్ పగ్గాలు అందుకున్నారో.. అప్పటి నుంచి విమర్శల్ని ఎదుర్కొంటూనే ఉన్నారు. ఫస్ట్ సీజన్‌కి ఎన్టీఆర్ హోస్ట్ కాగా.. రెండో సీజన్‌కి నాని హోస్టింగ్ చేశారు. ఇక మూడో సీజన్ నుంచి వరుసగా



ఓటీటీతో కలిపి ఏడు సీజన్లకు నాగార్జునే హోస్టింగ్ చేస్తున్నారు.


తనకి నచ్చిన వాళ్లకి ఒకరకంగా.. నచ్చని వాళ్లతో మరో రకంగా హోస్టింగ్ చేసి.. పక్షపాత బుద్ధి చూపిస్తూ వరస్ట్ హోస్ట్ అనిపించారు నాగార్జున. సినీ హీరోగా సంపాదించిన మంచి పేరుని బిగ్ బాస్‌తో పోగొట్టుకుంటున్నారు. ప్రతి ఒక్కడూ విమర్శించే వాడే అన్నట్టుగా.. విమర్శించే వారికి తన వరస్ట్ హోస్టింగ్‌తో అవకాశాన్ని ఇస్తున్నారు నాగార్జున.

ఓపక్క అటు కమల్ హాసన్ కానీ.. ఇటు కిచ్చా సుదీప్‌లకు కానీ.. బిగ్ బాస్ హోస్ట్‌లుగా క్లీన్ ఇమేజ్ ఉన్నా కూడా.. వాళ్లు హుందాగా తప్పుకుంటున్నారు. మరి నాగార్జున మాత్రం.. తన హోస్టింగ్‌పై ఎన్ని విమర్శలు వచ్చినా కూడా అలా చేసుకుంటూనే పోతున్నారు. అయితే సీజన్ 9 నాటికి నాగార్జున కూడా మనసు మార్చుకుని.. బిగ్ బాస్ హోస్టింగ్ నుంచి తప్పుకుంటే హుందాగా అనిపించడంతో పాటు.. ఉన్న ఇమేజ్ డ్యామేజ్ కాకుండా ఉంటుంది. లేదంటే.. సీజన్ 8లో వరస్ట్ హోస్ట్‌గా విమర్శలు ఎదుర్కొన్న నాగార్జున.. బిగ్ బాస్ హోస్ట్‌గా కొనసాగితే మరింత డ్యామేజ్ తప్పదు.

# తమిళ హీరోల పాత-కొత్త లుక్..







ప్రస్తుతం సాంకేతికత ఏ రేంజ్‌కి వెళ్లిపోయిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ముఖ్యంగా 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) రాకతో ఎన్నో అద్భుతాలు చూస్తున్నాం. అయితే సోషల్ మీడియాలో కూడా ఈ మధ్య ఏఐని బాగా వాడుతున్నారు. ముఖ్యంగా సెలబ్రిటీల ఫొటోలను, వీడియోలని ఏఐ సాయంతో మార్ఫింగ్ చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే కొంతమంది మాత్రం నలుగురిని నవ్వించడానికి, సరదా కోసం ఏఐ టూల్స్‌ని వాడుతున్నారు. తాజాగా ఓ అభిమాని ఇలానే కోలీవుడ్ హీరోల యంగ్ అండ్ ఓల్డ్ లుక్ ఫొటోలని ఏఐ సాయంతో వీడియోగా చేశాడు.

తమిళ ఇండస్ట్రీలోని అగ్ర హీరోలు రజినీకాంత్, కమల్ హాసన్, విజయ్, అజిత్ కుమార్ సహ పలువురికి సంబంధించిన ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఫొటోలు సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతున్నాయి. ఇందులో గొప్పేముంది అనుకుంటున్నారా? అయితే ఓ అభిమాని చేసిన ఈ వీడియోలో ఈ హీరోల ప్రెజెంట్ అలానే పాత లుక్‌ని కలిపి పక్కపక్కనే చూపించాడు. అది కూడా ఏఐ వీడియోగా. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈ వీడియోలో రజినీకాంత్ యంగ్‌గా ఉన్నప్పటి లుక్‌ని ప్రస్తుతం ఉన్న లుక్‌తో కలిపి వీడియోగా చూపించారు. అలానే కమల్ హాసన్, అజిత్, విజయ్, సూర్య, విజయ్ సేతుపతి, శివకార్తికేయన్, శింబు వీడియోలు కూడా ఉన్నాయి. ఇది చూసి ఫ్యాన్స్ భలే ఉంది అంటూ కామెంట్లు పెడుతున్నారు. ముఖ్యంగా రజినీ, విజయ్ ఫొటోలు సరిగ్గా సరిపోయాయ్ అంటున్నారు. ఏఐని ఇలా సరదాగా వాడటంతో నెటిజన్లు ఫన్నీ కామెంట్లు పెడుతున్నారు.

అలానే ఈ మధ్య కాలంలో ఏఐతో చాలా దారుణాలు కూడా చేస్తున్నారు. సినిమా సాంగ్స్‌లో హీరోయిన్ పక్కన హీరోలని తీసేసి తమ ఫొటోలతో ఏఐ వీడియోలను చేస్తున్నారు. వీటిపై ఇటీవల పలువురు సెలబ్రిటీలు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఎందుకంటే వీళ్ల పనితనం దెబ్బకి ఏది ఒరిజినల్ వీడియో అనేది కూడా చాలా మందికి అర్థం కావడం లేదు. అంతలా టెక్నాలజీని వాడేస్తున్నారు.

ఇలానే ఇటీవల ఒకరు బాలీవుడ్, టాలీవుడ్ లోని స్టార్ సెలబ్రిటీలు 'స్క్విడ్ గేమ్' వెబ్‌సిరీస్‌లోని పాత్రల తరహాలో తయారైనట్లు కొన్ని ఫొటోలు సృష్టించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో వీటిని ఓ వీడియో రూపంలో చేశారు. ఒక వేళ వీరంతా వైల్డ్ కార్డ్ ఎంట్రీతో స్క్విడ్ గేమ్‌లోకి వస్తే ఎలా ఉంటుందో ఊహించుకోండి అంటూ చేసిన ఈ వీడియో కూడా బాగా వైరల్ అయింది. ఇలా రానురాను ఈ టెక్నాలజీతో ఇంకెన్ని చూడాలో అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. నిజానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో చాలా సెక్టార్లలో ఉద్యోగాలు పోతున్నాయి. విదేశాల్లో అయితే ఇప్పటికే మెకానిక్‌గా చేసే పనులని చాలా వరకూ ఏఐ రీప్లేస్ చేసేసింది. మనిషి తన ఇంటెలిజెన్స్‌తో తయారు చేసిన 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'.. మనిషి చేసే పనులనే రీప్లేస్ చేయడం కొస మెరుపు. అయితే ఒక్కటి మాత్రం నిజం క్రియేటివిటీని ఉపయోగించి.. ఎమోషన్‌ని మిక్స్ చేసే ఏ పనినీ ఏఐ రీప్లేస్ చేయలేదు. అది ఎప్పటికీ అసాధ్యం.